క్లుప్తంగా

సంతకాల సేకరణ



ఆత్మకూర్: నీట్ 2024 పరీక్షల్లో జరిగిన అక్రమాలను సీబీఐతో విచారణ జరిపించాలని ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి అక్బర్, మండల అధ్యక్షుడు జుబేర్ అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో నీట్ పరీక్షల్లో జరిగిన అక్రమాలను విద్యార్థులకు వివరిస్తూ సంతకాల సేకరణ చేపట్టారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నీట్ అక్రమార్కులకు కొమ్ముకాస్తోందని ఆరోపించారు. ఒకే తరగతి గదిలో పరీక్ష రాసిన విద్యార్థులకు వరుసగా ఒకే విధంగా సమాన మార్కులు రావడమేమిటని ప్రశ్నించారు. బాధ్యులపై కఠినమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వ కళాశాలల్లో మెరుగైన విద్య



ఆత్మకూర్: ప్రభుత్వ కళాశాలల్లో ప్రైవేట్‌కు దీటుగా విద్యార్థులకు మెరుగైన విద్య అందిస్తున్నామని ప్రిన్సిపాల్ రాజేశ్వర్‌రావు అన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులతో సమావేశమై ఇంటర్ మొదటి సంవత్సరంలో విద్యార్థుల చేరికపై చర్చించారు. ఇక్కడ విద్యను చదువుకున్న విద్యార్థులు ఆశించిన స్థాయిలో ఫలితాలు సాధించారని, అధిక సంఖ్యలో విద్యార్థులు చేరే విధంగా ప్రోత్సహించాలని సూచించారు. అలాగే ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు భాగ్యవర్ధన్‌రెడ్డి, టీజే విశ్వేశ్వర్, కురుమూర్తి, రాఘవేందర్‌రావు, జమ్మన్న, శ్వేత, వీణ, లలితమ్మ, సునీల్‌కుమార్, పావని, రాఘవేందర్, చైతన్యరాణి, గోపాల్, విద్యార్థులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా అందించాలి



పాన్‌గల్: విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం నాణ్యతగా అందించాలని ఎంపీడీఓ కోటేశ్వర్, ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని మాధరావుపల్లి ప్రాథమిక పాఠశాలను వారు సందర్శించి ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు శాతం, విద్యార్థుల సామర్థ్యాలు, మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. ప్రభుత్వం విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను వివరిస్తూ విద్యార్థుల సంఖ్యను పెంచాలని ఆదేశించారు. ప్రతి నిత్యం భోజనం నాణ్యతను పరిశీలించాలని హెచ్‌ఎంకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వీరస్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై దృష్టి



ఆత్మకూర్: మున్సిపాలిటీల్లో అభివృద్ధిపై దృష్టి సారించాలని, పార్టీలకతీతంగా అందరిని భాగస్వామ్యం చేయాలని కలెక్టర్ ఆదర్శ సురభి కమిషనర్ నాగరాజుకు సూచించారు. నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆదర్శ సురభిని ఆత్మకూర్ మున్సిపల్ కమిషనర్ నాగరాజు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పలు అభివృద్ధి పనులపై వివరాలు అడిగి తెలుసుకున్నారు.

కొత్తకోట రూరల్: వనపర్తి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన ఆదర్శ సురభిని బుధవారం జిల్లా అసోసియేషన్ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను ఇచ్చి శాలువాలతో సత్కరించారు. ప్రభుత్వానికి ఇచ్చే సీఎంఆర్ రైస్ విషయంలో ప్రభుత్వానికి సహకరిస్తామని అసోసియేషన్ సభ్యులు కలెక్టర్‌కు తెలిపినట్లు వారు పేర్కొన్నారు. కలెక్టర్‌ను సన్మానించిన వారిలో రైస్‌మిల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తేనేటి శేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి విశ్వనాథం వెంకటరమణ, కోశాధికారి పల్లెర్ల జగన్, గౌరవ అధ్యక్షుడు రమేష్‌శెట్టి, పరమేశ్వర్, నరేందర్, సుబ్బయ్య తదితరులు ఉన్నారు.

గంగమ్మకు పూజలు

పెబ్బేరు రూరల్: భీమా ప్రాజెక్టు 15వ ప్యాకేజీ నుంచి రంగసముద్రానికి నీటిని విడుదల చేస్తుండడంతో బుధవారం నీరు రంగసముద్రానికి రావడంతో రైతులు, జెడ్పీటీసీ రాజేంద్రప్రసాద్‌యాదవ్ శ్రీరంగాపురం వద్ద గంగమ్మకు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఎల్లస్వామి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు రాములుయాదవ్, నాయకులు అశోక్‌రెడ్డి, రాజగౌడ్, శివనారాయణ, సాప్పురి రమేష్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.



అప్రమత్తత తప్పనిసరి



పాన్‌గల్‌లోని ఫర్టిలైజర్ షాపులో తనిఖీ చేస్తున్న మండల టాస్క్‌ఫోర్స్ అధికారులు (ఫైల్)

- విత్తనాలు, ఎరువుల కొనుగోళ్లలో జాగ్రత్త
- ప్రకటనలు నమ్మి మోసపోవద్దు
- మార్కెట్‌లో నకిలీల మాయ

మండలంలో పంటల సాగు అంచనా (ఎకరాల్లో)

వరి	కంది	ఆముదం
13,210	264	82
పత్తి	**మొక్కజొన్న**	**కూరగాయలు**
40	54	20

పాన్‌గల్: చేను మీది.. కష్టం మీది... ప్రతిఫలం కూడా మీకే దక్కాలి. మీరు పొలం దున్నుతున్నారంటే విత్తనాలు, ఎరువులు, పురుగుల మందులను కొనుగోలు చేయాలని ఎవరెవరో మీ వద్దకు వస్తుంటారు. వారి మాటలు నమ్మి మోసపోయి మీ కష్టాన్ని వృథా కానివ్వకండని వ్యవసాయ అధికారులు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు. కొనుగోళ్లలో ఎంత జాగ్రత్త పాటిస్తే అంత దిగుబడి మీకే దక్కుతుంది. మార్కెట్‌లోకి నకిలీ మందులు, ఎరువులు ఎక్కువగా వస్తున్నాయి. వర్షాకాలంలో పత్తి, కంది, మొక్కజొన్న సాగుతో కలుపుకొని 13,650 ఎకరాలు సాగు చేసే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. కూరగాయలు 20 ఎకరాల్లో సాగు చేస్తారని అధికారులు చెబుతున్నారు. అన్ని రకాల ఎరువులు కలుపుకొని 19,656 మెట్రిక్ టన్నులు అవసరమని గుర్తించి ప్రభుత్వానికి అధికారులు నివేదించారు. మండలంలో ఫర్టిలైజర్, పురుగుల మందులు, విత్తనాల దుకాణాలు కలిపి మొత్తం 24 ఉన్నాయి.

విత్తనాల ఎంపిక ఇలా..

- వ్యవసాయ శాఖ ద్వారా లైసెన్సు పొందిన డీలర్ల వద్దనే విత్తనాలు కొనుగోలు చేయాలి.
- బిల్లుపై నంబర్, విత్తన రకం, కొనుగోలు తేదీ, డీలర్ సంతకం ఉండేలా చూసుకోవాలి.
- మొలకెత్తే, పూత దశలో పంటలో లోపం కనిపిస్తే వ్యవసాయశాఖ లేదా శాస్త్రవేత్తలను సంప్రదించాలి.
- బిల్లులను పంట కాలం పూర్తయ్యే వరకు ఉంచుకోవాలి

పురుగు మందుల..

- వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనల మేరకే పురుగుల మందుల వాడాలి.
- నిల్వ ఉంచిన మందులను వాడొద్దు. లైసెన్సు ఉన్న దుకాణాల్లోనే కొనుగోలు చేయాలి.
- పురుగుల మందు డబ్బాలపై చక్రపు ఆకారంలో పురుగుస్థాయిని తెలిపే రంగులు ఉంటాయి. అత్యంత విషపూరితమైతే నీలంరంగు, స్వల్ప విషపూరితమైతే ఆకుపచ్చరంగు గుర్తులు ఉంటాయి.

ఎరువుల్లో..

- మిషన్ కుట్టుతో ఉన్న ఎరువుల సంచులు మాత్రమే వాడాలి. ఒక వేళ చేతి కుట్టుతో ఉంటే సీసం సీల్ ఉందో లేదో చూసుకోవాలి.
- కొనుగోలు సమయంలో డీలర్ రికార్డులో రైతు విధిగా సంతకం చేయాలి. నాణ్యతపై అనుమానం ఉంటే వెంటనే అధికారులకు సమాచారం ఇచ్చి పరీక్షించుకోవాలి.

కల్తీని గుర్తించడం ఇలా....

- యూరియా, కాల్షియం, అమ్మోనియం, నైట్రేట్ వంటి ఎరువులు గుళికల రూపంలో ఉంటాయి. ఎరువులు ఇసుక రేణువుల రూపంలో పొటాష్, సూపర్‌ఫాస్ఫేట్ పౌడర్ రూపంలో ఉంటాయి.
- 5 మిల్లీమీటర్ల నీటిలో చెంచా ఎరువును వేసి బాగా కలపాలి. ఇది స్వచ్ఛమైన ద్రావణంగా తయారైతే నాణ్యమైన ఎరువుగా గుర్తించవచ్చు. యూరియాను ఒక చెంచాను ఐదు మిల్లీలీటర్ల పరిశుభ్రమైన నీటిలో వేసి బాగా కలిపితే అడుగున మట్టి చేరితే కల్తీగా గుర్తించాలి.

రైతులకు అవగాహన కల్పించాలి



ఎరువులు, విత్తనాల ఎంపిక విషయంపై గ్రామాల్లో రైతులకు అవగాహన కల్పించాలి. రైతులు మోసపోకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. సీజన్ సమయంలో మాత్రమే అధికారులు తనిఖీలు నిర్వహించి మిగతా సమయంలో పట్టించుకోకపోవడంతో ఫర్టిలైజర్ షాపు వారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.

– కోదండరాములు, రైతు సంఘం నాయకుడు, రేమద్దుల

జాగ్రత్తలు పాటించాలి



నాసిరకం విత్తనాలు కొనుగోలు చేస్తే పంట ఎదుగుదల లేక రైతులు ఆర్థికంగా నష్టపోతారు. ఎరువులు, విత్తనాలు కొనుగోళ్లలో జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి. మాయమాటలతో వ్యాపారులు నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. తక్కువ ధరకే వస్తున్నాయంటే అందులో ఖచ్చితంగా మోసం ఉంటుంది. కొనుగోలు చేసే సమయంలో షాపు యజమాని నుంచి రశీదు పొందాలి. మోసాలను ఎదుర్కోవడంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి.

– చంద్రశేఖర్, ఏడీఏ, పాన్‌గల్

పాఠశాలల్లో నిధుల వినియోగంపై ఆడిట్



ఎమ్మార్సీ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

పాన్‌గల్: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో 2023–24 సంవత్సరంలో వచ్చిన నిధులు, ఖర్చు చేసిన విధానంపై బుధవారం మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయంలో ఆడిట్ నిర్వహించినట్లు ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ తెలిపారు. ఆయా పాఠశాలలకు వచ్చిన నిధులతో ఖర్చు చేసిన విధానానికి సంబంధించిన అన్ని రకాల బిల్లుల్లో ఆయా పాఠశాలలు ఆడిట్ చేయించుకోవాలన్నారు. ఇప్పటి వరకు 20 పాఠశాలలకు సంబంధించిన ఆడిట్ పూర్తి చేసినట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యాలయం సిబ్బంది శేఖర్‌నాయక్, మూర్తి పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయంలో..

మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మండల పరిషత్ నిధుల ద్వారా వివిధ గ్రామాల్లో 2023–24 సంవత్సరంలో ఖర్చు చేసిన విధానానికి సంబంధించి బుధవారం ఎంబీ రికార్డులను ఆడిట్ అధికారులు పరిశీలించారు. మండలంలోని 28 గ్రామ పంచాయతీల్లో ఆయా నిధులతో చేసిన పనులు, వాటికి సంబంధించిన ఎంబీ రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు.

రహదారి విస్తరణ పూర్తి చేయాలి



కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పెబ్బేరు రూరల్: పట్టణంలో చేపట్టిన రోడ్ల విస్తరణ, డ్రెయినేజీ పనులను త్వరగా పూర్తి చేయాలని కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్‌గౌడ్ స్థానిక నాయకులతో కలిసి బుధవారం మున్సిపల్ కమిషనర్ ఆదిశేషుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెబ్బేరు పట్టణంలోని సుభాష్‌చౌరస్తా నుంచి పీజేపీ కెనాల్ వరకు రోడ్డు విస్తరణ, రోడ్డుకు ఇరువైపులా డ్రెయినేజీ పనులు పూర్తి చేయాలని కోరారు. రోడ్ల విస్తరణ కాకపోవడంతో పాదచారులు, వాహనదారులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని, పెద్ద వాహనాల రాకపోకలు గుంతలు ఏర్పడి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేక వర్షపు, మురుగు నీరు రోడ్లపై రావడంతో దోమల బెడద ఎక్కువైందని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వర్షాకాలం వరకు పనులు పూర్తి చేయాలని కోరారు.

దుకాణాలకు వేలం



వేలం నిర్వహిస్తున్న అధికారులు

పెబ్బేరు రూరల్: వనపర్తి మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న షాపింగ్ కాంప్లెక్స్ ఖాళీగా ఉన్న రెండు షాపులకు బుధవారం వేలం నిర్వహించినట్లు ఎంపీడీఓ రాఘవ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వేలంలో 4 నంబరు షాపునకు ముగ్గురు వ్యక్తులు పోటీపడగా.. వనపర్తి పట్టణంలోని టీచర్స్ కాలనీకి చెందిన ఎస్ నాగరాజు రూ. 6,500, 8వ నంబర్ షాపునకు ఏడుగురు పోటీపడగా.. పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీకి చెందిన ఎం నవీన్‌సాగర్ రూ. 28,500 కిరాయికి షాపులను దక్కించుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ గురురాజాచారి, సుజాత, ఈపీఆర్ నితీష్, ఈసీ భాస్కర్ పాల్గొన్నారు.

స్వచ్ఛ పట్టణంగా తీర్చిదిద్దుదాం



మరుగుదొడ్డిని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ మంగమ్మ

అమరచింత: పట్టణాన్ని స్వచ్ఛతలో ముందుంచి సంపూర్ణ పారిశుద్ధ్య పట్టణంగా మార్చుకునేందుకు ప్రజలు మున్సిపాలిటీకి సహకరించాలని చైర్‌పర్సన్ మంగమ్మ కోరారు. పట్టణంలోని ఐదో వార్డులో రూ.ఏడు లక్షలతో నిర్మించిన సామూహిక మరుగుదొడ్డిని బుధవారం ప్రారంభించారు. ఈసందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ మున్సిపాలిటీలో ఇప్పటి వరకు కొత్తగా ఐదు సామూహిక మరుగుదొడ్లను నిర్మించినట్లు తెలిపారు. స్థల ప్రభావంతో సమస్యను ఎదుర్కొంటున్న ప్రాంతాలను గుర్తించి ఈ నిర్మాణాలు చేపట్టినట్లు తెలిపారు. బస్టాండ్ రహదారిలో మహిళలు, పురుషుల సౌకర్యార్థం నిర్మించామన్నారు. రాజకీయాలకు అతీతంగా అమరచింత పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుందామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాజ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ నురుల్ నదీం తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలు పరిరక్షించేందుకు చర్యలు



పట్టణంలోని లేఅవుట్లను పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ నురుల్ నదీం

అమరచింత: పట్టణంలోని ప్రభుత్వ స్థలాలతో పాటు, డీటీసీపీ లేఅవుట్ల ద్వారా మున్సిపాలిటీకి అప్పగించిన 10శాతం స్థలాల పరిరక్షణ బాధ్యతలను మున్సిపల్ వార్డు ఆఫీసర్లకు అప్పగిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ నురుల్‌నదీం తెలిపారు. పట్టణంలోని లేఅవుట్లలో గల పది శాతం స్థలాలను గుర్తించడంతో పాటు వాటిలో మొక్కలను పెంచేందుకు శ్రీకారం చుట్టాలని సిబ్బందికి సూచించారు. ఈ నేపథ్యంలో సిబ్బందితో కలిసి లేఅవుట్లను సందర్శించారు. ఈసందర్భంగా మున్సిపల్ కమిషనర్ మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చూడాలని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో పాటు కలెక్టర్ ఆదేశాల మేరకు స్థలాలను గుర్తిస్తున్నామని పేర్కొన్నారు. పట్టణంలో బిలకంటి గోవర్ధన్, మరెడి నరేష్‌రెడ్డి, పోసిరిగారి తిరుమలేష్, తాటికొండ రమేష్, రంగు యశోదమ్మ, మరెడి సాయిరెడ్డితో పాటు మియవాకిలోని లేఅవుట్లను పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఆర్ఐ కృష్ణయ్య, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

పూర్వ ప్రాథమిక విద్యపై అంగన్‌వాడీలకు శిక్షణ



మాట్లాడుతున్న సంక్షేమ అధికారి లక్ష్మీబాయి

పెబ్బేరు రూరల్: పూర్వ ప్రాథమిక విద్యపై బుధవారం పెబ్బేరు ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లకు సీడీపీఓ లక్ష్మమ్మ ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీబాయి మాట్లాడుతూ మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లందరికీ ఆట, పాటలతో కూడిన మెరుగైన విద్య అందించడమే లక్ష్యంగా ప్రతి అంగన్‌వాడీ పనిచేయాలని సూచించారు. ఈ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలను ఐదు బ్యాచ్‌లుగా విభజించి ఒక్కొక్క బ్యాచ్‌కు మూడు రోజుల పాటు శిక్షణ ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు లక్ష్మీదేవి, బాలీశ్వరమ్మ, ఆసియా, షాహీన్ బేగం, లక్ష్మీనారాయణమ్మ, బ్లాక్ కోర్డినేటర్ క్రిష్ణవేణి, అమీర్‌ఖాన్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ జన్మదిన వేడుకలు



డీసీసీ కార్యాలయం వద్ద రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి



రాజీవ్ చౌక్‌లో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

సాక్షి, నెట్‌వర్క్: ఇందిరాగాంధీ స్ఫూర్తిని నింపుకొని రాజీవ్‌గాంధీ ఆశయ సాధనకు రాహుల్‌గాంధీ కృషి చేస్తున్నారని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ఎమ్మెల్యే మేఘారెడ్డి అన్నారు. బుధవారం రాహుల్‌గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజా గొంతుకగా పోరాడుతున్న రాహుల్‌పై ప్రజల్లో విశ్వాసం పెరిగిందిని, భవిష్యత్‌లో ఆయన ప్రధాని అవుతారని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నందిమల్ల యాదయ్య, బి.కృష్ణ, కమర్‌మియా, రాములు, పెంటన్నయాదవ్, రాగి వేణు, వీణాచారి, బి.శ్రీనివాస్‌గౌడ్, వనపర్తి పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్, మాజీ ఎంపీపీ శంకర్ నాయక్, టీపీసీసీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రశాంత్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌జే బోయేజ్, పి.కృష్ణారెడ్డి, పీజే బాబు, సలీంఖాన్, బీచుపల్లి, విజయ్‌కుమార్, దేవిజానాయక్, గాండ్ల నరేందర్, రాములుయాదవ్, శివనారాయణ, ఆంజనేయులు, గంగాధర్, సాప్పురి రమేష్, లోకేష్, రఘు, గాలెన్న పాల్గొన్నారు.

పలుస శంకర్‌గౌడ్‌కు మాతృవియోగం

వనపర్తిటౌన్: సాహితీ కళావేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్‌గౌడ్‌కు మాతృవియోగం కలిగింది. మంగళవారం అర్ధరాత్రి ఆయన మాతృమూర్తి, తాటిపాముల మాజీ సర్పంచ్ అనసూయమ్మ మృతి చెందారు. విషయం తెలుసుకున్న రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, జెడ్పీచైర్మన్ లోక్‌నాథ్‌రెడ్డి, జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్, డీఈఓ గోవిందరాజులు, మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, మాజీ చైర్మన్లు రమేష్‌గౌడ్, గట్టుయాదవ్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ, కౌన్సిలర్లు, సాహితీవేత్తలు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, తదితరులు బుధవారం మర్రికుంటలోని వారి నివాసంలో కలిసి శంకర్‌గౌడ్‌ను, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

పాన్‌గల్‌లో విషాదఛాయాలు

పాన్‌గల్: జూరాల ప్రాజెక్టు సందర్శనకు స్నేహితులతో కలిసి వెళ్లి ఆత్మకూర్ మండల సమీపంలో కారు బోల్తాపడిన ఘటనలో మండల కేంద్రానికి చెందిన బీటెక్ విద్యార్థి రోషన్ (23) మంగళవారం రాత్రి మృతి చెందడంతో పాన్‌గల్‌లో విషాదఛాయాలు అలుముకున్నాయి. మండల కేంద్రానికి చెందిన చాకలి విష్ణు, సాలమ్మ దంపతుల ద్వితీయ కుమారుడు రోషన్ హైదరాబాదులో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. ఇటీవల సొంత గ్రామానికి వచ్చిన అతడు.. ఇదే గ్రామానికి చెందిన స్నేహితులతో కలిసి మంగళవారం జూరాల సందర్శనకు వెళ్లి రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. పేద కుటుంబానికి చెందిన వారు కుల వృత్తినే నమ్ముకొని స్వగ్రామంలో జీవనం సాగిస్తూ పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్నారు. అంతలోనే ప్రమాదంలో రోషన్ చనిపోవడంతో తల్లిదండ్రులు వాపోతున్నారు.

బాధితుడికి పరామర్శ

పెబ్బేరు రూరల్: వనపర్తి మండలంలోని అంకూర్‌కు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్‌రెడ్డి రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మహబూబ్‌నగర్‌లోని కార్తీక్ న్యూరో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి బుదవారం బాధితుడిని ఆస్పత్రిలో పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో వెల్టూరు మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, జయపాల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఆధార్ అనుసంధానం పూర్తి చేయాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ కోటేశ్వర్

పాన్‌గల్: మండలంలోని అన్ని గ్రామాల్లో జాబ్‌కార్డులకు ఆధార్ అనుసంధానం పూర్తి చేయాలని ఎంపీడీఓ కోటేశ్వర్, ఏపీఓ కుర్మయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హరితహారంలో ప్రతి గ్రామానికి నిర్దేశించిన లక్ష్యానికి అనుగుణంగా గుంతలు తవ్వడం, మొక్కలను సిద్ధం చేసుకోవాలన్నారు. అన్ని గ్రామాల్లో హరితహారం, పండ్ల తోటలను నాటించడం, పండ్ల తోటలు ఉన్న రైతుల పొలాలల్లో ఫాం పండ్స్ నిర్మాణం వంటి వాటికి ప్రాధాన్యత ఇవ్వాలని ఆదేశించారు. మండలంలో చేపట్టిన ఉపాధి పనుల పరిశీలనకు కేంద్ర కమిటీ టీంలు వస్తున్నాయని, దానికి అనుగుణంగా అన్ని రికార్డులను పక్కగా ఉంచుకోవాలని సూచించారు. అన్ని గ్రామాల్లో ఏడు రిజిస్టర్లు, జాబ్‌కార్డుల నిర్వహణ, పనులు జరిగిన ప్రాంతాల్లో పనులకు సంబంధించిన బోర్డులు పెట్టించాలన్నారు. పనుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఈసీ అంజన్‌రెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డు అసిస్టెంట్లు పాల్గొన్నారు.

చదువుకుంటేనే ఉజ్వల భవిష్యత్



మూసాపేటలో అక్షరాభ్యాస కార్యక్రమంలో ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

అడ్డాకుల: విద్యార్థులు కష్టపడి చదువుకుంటేనే ఉన్నత శిఖరాలకు చేరి ఉజ్వల భవిష్యత్ లభిస్తుందని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. అడ్డాకుల జెడ్పీ హైస్కూల్‌లో ఎల్‌అండ్‌టీ సహకారంతో నిర్మించిన మరుగుదొడ్లను బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు యూనిఫాం, పాఠ్య పుస్తకాలను పంపిణీ చేశారు. అదే విధంగా మూసాపేట పాఠశాలలో బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొని విద్యార్థులకు అక్షరాభ్యాసం చేయించారు. తర్వాత దుస్తులు, పుస్తకాలను పంపిణీ చేశారు. మూసాపేటకు చెందిన మేకల జనార్ధన్ తన సొంత ఖర్చులతో ఏర్పాటు చేయించిన వైకుంఠ రథం, ఫ్రీజర్ బాక్సులను ఎమ్మెల్యే ప్రారంభించి దాతను సత్కరించారు. మండలానికి చెందిన 7 మంది రైతు కుటుంబాలకు రైతు బీమా చెక్కులను పంపిణీ చేశారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ తమ ప్రభుత్వం విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. గత ప్రభుత్వం విద్యా వ్యవస్థను నాశనం చేసిందని విమర్శించారు. కార్యక్రమంలో ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రాధిక, టోల్‌ప్లాజా హెడ్ దీపామాడియా, పార్టీ మండలాధ్యక్షులు శ్రీహరి, శెట్టిశేఖర్, నాయకులు రామన్‌గౌడ్, బగ్గి కృష్ణయ్య, బాలనర్సిములు, విజయమోహన్‌రెడ్డి, జగదీశ్వర్, గోవర్ధన్, నాగిరెడ్డి, ఎన్టీగౌడ్, శరత్‌రెడ్డి, లక్ష్మికాంత్‌రెడ్డి, మహేందర్ తదితరులు ఉన్నారు.

కుర్చీలు అందజేత



కొత్తకోట రూరల్: అమడబాకుల సమీపంలో గల మోడల్ స్కూల్‌కు జోగులాంబ గద్వాల జిల్లా అయిజ మండల కేంద్రానికి చెందిన మధుగౌడ్ 100 కుర్చీలను అందజేశారు. పాఠశాల అభివృద్ధి కోసం తన వంతు సహాయ సహకారం అందించిన మధుగౌడ్‌కు ప్రిన్సిపాల్ శ్రీనివాసచారితో పాటు ఉపాధ్యాయ బృందం కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మధుగౌడ్ మాట్లాడుతూ మెరుగైన బోధనతో ఉత్తమ ఫలితాలను సాధిస్తున్న మోడల్ స్కూల్ భవిష్యత్తులో మరింత ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నరేష్‌కుమార్, ఉపాధ్యాయ బృందం తదితరులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



ఆత్మకూర్: మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న కార్మికుల సమస్యలన్నింటిని ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు హన్మంతు, ప్రసాద్, రాజు, సతీష్ అన్నారు. బుధవారం కార్మికులతో కలిసి స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టి, కమిషనర్ నాగరాజుకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేశారు. 2021 జూన్ నుంచి పెరిగిన 30 శాతం వేతనాన్ని ఇవ్వాలని, పీఎఫ్‌ను అమలు చేయాలని, ఆరోగ్య, గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు.